క్లుప్తంగా

బాధితురాలికి మాజీ హోంమంత్రి పరామర్శ



రాజారావు భార్యను పరామర్శిస్తున్న తానేటి వనిత, పార్టీ నాయకులు

నల్లజర్ల: మండల కేంద్రం నల్లజర్లకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గోగులమండ రాజారావు భార్య గత కొంతకాలంగా అనారోగ్యానికి గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ హోంమంత్రి తానేటి వనిత శనివారం ఆమెను పరామర్శించారు. ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆమె వెంట పార్టీ మండల కన్వీనర్ వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం, నాయకులు బంక అప్పారావు, వల్లూరి శేషగిరి రావు, పల్లిబ్బారావు, నీరుకొండ సుబ్బారావు తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి తలారి వెంకట్రావు పరామర్శ



సుజాతమ్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న తలారి వెంకట్రావు, నాయకులు

తాళ్లపూడి: మండలంలోని పెద్దేవం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి సిర్రా గంగారావు భార్య సుజాతమ్మ అనారోగ్యం కారణంగా ఇటీవల మృతి చెందారు. ఈ మేరకు కొవ్వూరు నియోజకవర్గ పార్టీ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు బాధిత కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు, నాయకులు తోట రామకృష్ణ, కొమ్మిరెడ్డి పరశురామారావు, మండలంలోని పలు పార్టీలకు చెందిన నాయకులు తదితరులు ఉన్నారు.

ఎస్సీ కమిషన్ చైర్మన్ పరామర్శ

గంగారావు కుటుంబాన్ని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ పరామర్శించి తన సంతాపం తెలిపారు. నాయకులు బోడపాటి కాశీ, ఆత్కూరి రాంబాబు, నక్కా చిట్టిబాబు తదితరులున్నారు.

ఎంపీపీకి అభినందనల వెల్లువ



ఎంపీపీ వీరాస్వామిని సత్కరిస్తున్న గ్రామస్తులు

చాగల్లు: ఎంపీటీసీల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన చాగల్లు ఎంపీపీ మట్టా వీరాస్వామిని శనివారం పలువురు అభినందించారు. చాగల్లు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వీరాస్వామిని దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సానబొయిన అర్జున రావు, ఇంటి వీర్రాజు, ఉన్నమట్ల బ్రహ్మానందం, సర్పంచ్ కుదప రాంబాబు, ఉప సర్పంచ్ మేకా రాజు, మాజీ ఎంపీటీసీ బొర్రా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 106 కేసులు రాజీ



కొవ్వూరు కోర్టులో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జిలు

తాళ్లపూడి(కొవ్వూరు): రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు పట్టణంలోని స్థానిక కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 106 కేసులు రాజీ అయ్యాయని 9వ అదనపు జిల్లా జడ్జి ఎం.అనురాధ వెల్లడించారు. మండల న్యాయ సేవ సంస్థ అధ్వర్యంలో శనివారం కొవ్వూరు కోర్టు ప్రాంగణంలో పెండింగ్, ప్రీ లిటిగేషన్ కేసుల పరిష్కారం నిమిత్తం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ మేరకు 3 బెంచ్‌లను ఏర్పాటు చేశారు. ప్రీ లిటిగేషన్ కేసుల పరిష్కర నిమిత్తం మొదటి బెంచ్‌కు సంస్థ చైర్మన్ 9వ అదనపుజిల్లా జడ్జి ఎం.అనురాధ, న్యాయవాది సభ్యుడిగా వై.చలపతి, సివిల్ కేసుల బెంచ్‌కు సీనియర్ సివిల్ జడ్జి జీవీఎల్ సరస్వతి, న్యాయవాది సభ్యుడిగా ఎం.గోపి, సివిల్, క్రిమినల్ కేసుల బెంచ్‌కు జడ్జిగా కె.నాగలక్ష్మి, న్యాయవాది సభ్యుడిగా కె.బ్రహ్మయ్య వ్యహరించారు. విభాగాల వారీగా సివిల్ కేసులు 29 రాజీ కాగా రూ.1,87,85,446 కోట్లు, ఎక్సైజ్ కేసులు 12 రాజీ కాగా రూ.42,965, క్రిమినల్ కేసులు 45, వీటి నిమిత్తం రూ. 4,90,000, మొత్తం 106 కేసులకు సంబంధించి రూ.1,93,18,411 కోట్ల మేర రాజీ చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ ప్రెసిడెంట్, న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది, కోర్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

పంట పొలాలు విషతుల్యం

- విచ్చలవిడిగా ఎరువుల వినియోగం
- క్షీణిస్తున్న భూసారం, మానవుల ఆరోగ్యం
- అవగాహన కల్పిస్తున్నా ఫలితం శూన్యం



చాగల్లు మండలంలో పురుగు మందును పిచికారీ చేస్తున్న రైతు

చాగల్లు: అధిక దిగుబడులే లక్ష్యంగా రైతన్నలు రసాయన ఎరువులు భారీగా వినియోగించడంతో పుడమి తల్లి రోజురోజుకు విషమెక్కుతోంది. ప్రధానంగా కొవ్వూరు నియోజకవర్గ వ్యాప్తంగా తెగుళ్లను అంతమొందించేందుకు విచ్చలవిడిగా మోనో్క్రోటోఫాస్, ట్రైకోడెర్మావిరిడె, డైక్లోరోవాస్ లాంటి ప్రమాదకరమైన పురుగు మందులను వాడుతున్నారు. దీంతో భూసారం తగ్గడమే కాకుండా దిగుబడి నామమాత్రంగానే వస్తుంది. రెండోసారి వేసిన పంటకు కనీస స్థాయిలో పెట్టుబడి రావడం లేదు. రసాయన ఎరువులు వినియోగాన్ని తగ్గించడానికి వ్యవసాయధికారులు చేపడుతున్న చర్యలు పెద్దగా ఫలించడం లేదు. మరోవైపు బయోమెట్రిక్ ద్వారానే ఎరువులు విక్రయించాలనే కేంద్ర ప్రభుత్వం నిర్ణయం పూర్తి స్థాయిలో అమలు కావడం లేదు. ఇప్పటికైనా రసాయనిక ఎరువులు వినియోగం తగ్గిస్తే పంటలతో పాటు పర్యావరణానికి కూడా మేలని శాస్త్రవేత్తలు అంటున్నారు.

నియోజకవర్గంలో పరిస్థితి ఇది

కొవ్వూరు నియోజకవర్గంలోని మూడు మండలాల్లో సుమారు 20 వేల హెక్టార్లలో రైతులు వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారు. సుమారు యాభై వేల మంది రైతులు పలు రకాల పంటలు పండిస్తున్నారు. అధిక దిగుబడులు వస్తాయనే అపోహతో కొంతమంది అన్నదాతలు రసాయనిక ఎరువులు కొనుగోలు చేస్తున్నారు. వీటి ఫలితంగా క్రమక్రమంగా భూసారం క్షీణిస్తుంది. వాస్తవానికి భూసార పరీక్షల ఆధారంగా రైతులు తమ పొలాల్లో ఏ ధాతువు అధికంగా ఉందో దానికి సంబంధించిన ఎరువును మాత్రమే వేయాలి, అయితే దీనిపై గ్రామీణ ప్రాంత రైతులకు అవగాహన లేకపోవడంతో విచ్చలవిడిగా రసాయనిక ఎరువులు వినియోగిస్తున్నారు.

కిడ్నీ, జీర్ణ వ్యవస్థలపై ప్రభావం

దిగుబడి మాట ఎలా ఉన్నా ఎరువుల వాడకంతో పంట భూములు విషతుల్యమవుతున్నాయి. ఈ భూముల్లో పండించిన పంటలు కూడా విషపూరితమవుతున్నాయి. వీటిని తినడం వల్ల మానవ కిడ్నీలు, జీర్ణ వ్యవస్థలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. చేల గట్లపై పెరిగే పచ్చగడ్డి కూడా విషతుల్యం కావడం వల్ల వీటిని ఆహారంగా తీసుకునే పశువులు ఆరోగ్యం కూడా దెబ్బతింటోంది. అధికారులు రసాయనిక ఎరువులు వినియోగం తగ్గించడానికి ఇప్పటికైనా రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని పలువురు కోరుతున్నారు.

అవగాహన కల్పించిన శూన్యం

అధిక దిగుబడుల కోసం రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని, సేంద్రియ వ్యవసాయ విధానంలో సాగు చేయాలని వ్యవసాయాధికారులు పలుమార్లు అవగాహన కల్పిస్తున్నా రైతులు పెడచెవిన పెడుతున్నారు. విచ్చలవిడిగా ఎరువుల వినియోగిస్తుండడంతో పంట పొలాల్లో ప్రవహించే నీరు, సమీప భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. ఆ నీటిని తాగి మూగజీవాలు అనారోగ్యానికి గురవుతున్నాయి. సేంద్రియ సాగు విధానాలపై అవగాహన కల్పిస్తున్నా.. పరిస్థితిలో మార్పు రాకపోవడం శోచనీయం.

అధిక దిగుబడుల కోసమే..



కొంతమంది రైతులు అధిక దిగుబడులు వస్తాయానే ఆశతో రసాయనిక ఎరువులు అధికంగా వాడుతున్నారు. ఇది మంచిది కాదు. నేను వరి సాగులో సేంద్రియ ఎరువులను వాడుతున్నాను. అధికారుల సూచన మేరకు ఎరువులు వాడితే పర్యావరణానికి మేలు జరుగుతుంది.

–ప్రత్తిపాటి రామచంద్రరావు, రైతు, కలవలపల్లి

ఆరోగ్యానికి హానికరం



అధిక మోతాదులో రసాయనిక మందులు వినియోగం మంచిది కాదు. రైతులు భూసార పరీక్షల ఆధారంగా తగు సూచనలు మేరకు ఎరువులు వాడాలి. రసాయానిక ఎరువులతో మానవుని ఆరోగ్యంతో పాటు, భూసారం దెబ్బతింటుంది. అందువలన పచ్చిరొట్ట, ఇతర సేంద్రియ ఎరువులపై రైతులు దృష్టిసారించాలి.

–కె వేణుగోపాల్, వ్యవసాయాధికారి, చాగల్లు

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి



డ్రోన్‌తో వరిచేనుకు కషాయాలను పిచికారీ చేస్తున్న రైతులు

దేవరపల్లి: మండల కేంద్రం దేవరపల్లిలో పలువురు రైతుల వరిచేలల్లో శనివారం డ్రోన్ ద్వారా వివిధ రకాల కషాయాలను వ్యవసాయాధికారులు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం డివిజన్ మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ క్రిమిసంహారిక మందుల వాడకాన్ని తగ్గిస్తూ సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను అవలంభించి కషాయాలను పంటలకు వినియోగిస్తున్నట్టు ఆయన తెలిపారు. మండల పరిధిలోని ఖరీఫ్ సాగులో 854 ఎకరాలకు గాను 256 మంది రైతులు చేపబెల్లం ద్రావణం, అగ్నిహస్తం మిశ్రమాన్ని ఎకరం చేనుకు ఐదు నిముషాల్లో డ్రోన్ ద్వారా పిచికారీ చేసినట్టు ఆయన పేర్కొన్నారు. దీని ద్వారా రైతులకు తక్కువ ఖర్చుతో పాటు సమయం ఆదా అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు జ్యేష్ఠ రమేష్, జ్యేష్ఠ శ్రీనివాస్, దేవిన వెంకటరామారావు, దేవిన రాజేష్, గ్రామ ఇంటర్నల్ కమ్యూనిటీ రీసోర్స్ పర్సన్స్ ఉప్పలపాటి ప్రసన్న, వల్లూరి పద్మావతి, గోశాల సురేఖ పాల్గొన్నారు.

సిబ్బంది పనితీరు మెరుగుపరుచుకోవాలి



మాట్లాడుతున్న డీఎస్పీ దేవ కుమార్

తాళ్లపూడి: డివిజన్‌లోని పోలీస్ స్టేషన్లలో సిబ్బంది పనితీరు సంతృప్తికరంగానే ఉందని, కాలానుగుణంగా మరికొంత మార్పు చేసుకోవాలని కొవ్వూరు డీఎస్పీ దేవ కుమార్ సూచించిచారు. తాళ్లపూడి పోలీస్ స్టేషన్‌ను శనివారం సాధరణ తనిఖీల్లో భాగంగా పరిశీలించారు. డీఎస్పీ మాట్లాడుతూ తాళ్లపూడి మెయిన్ రోడ్డులో మద్యం దుకాణం కారణంగా రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందన్న విషయం తమ దృష్టికి వచ్చిందని, ట్రాఫిక్ సమస్య పునరావృతం కాకుండా ఆర్డీఓ, సంబంధిత అధికారులతో చర్చించి ఆక్రమణల తొలగింపు చేపడతామన్నారు. మండల పరిధిలోని ఇటీవల కేసులు (నేరాల) సంఖ్య తగ్గిందని పేర్కొన్నారు. నేరాల అదుపు కోసం ప్రధాన జంక్షన్లల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, స్టేషన్‌కి ప్రత్యేక డ్రోన్‌లను అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు రూరల్ సీఐ బి.విజయ బాబు, ఎస్సై రామకృష్ణ, ట్రైనీ ఎస్సై ఆదిత్య సిబ్బంది పాల్గొన్నారు.

15 నెలల పాలనలో అన్నీ అరాచకాలే



సభకు హాజరైన ప్రజలు



చంద్రబాబు మోసాలను వివరిస్తున్న తలారి వెంకట్రావు, నాయకులు

చాగల్లు: గత ఎన్నికల సమయంలో అబద్ధపు హామీలు ఇచ్చి చంద్రబాబు మరోసారి ప్రజలను మోసం చేశారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆరోపించారు. 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమంలో భాగంగా శనివారం సర్పంచ్ మద్దిపాటి శ్రీరామమూర్తి అధ్యక్షతన చంద్రవరం గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. సభకు ముఖ్యఅతిథిగా హాజరైన తలారి మాట్లాడుతూ 15 నెలల పాలనలో చంద్రబాబు మహిళలను ఉచిత బస్సు పేరుతో దగా చేశారన్నారు. తల్లికి వందనం పేరుతో రాష్ట్రంలో 87 లక్షల మంది తల్లులు ఉంటే 54 లక్షల మందికి మాత్రమే ఈ పథకం అమలు చేసి వంచించారన్నారు. రాష్ట్రంలో వైద్యం, వ్యవసాయ రంగాలను కూటమి నిర్వీర్యం చేసిందని, ఆరోగ్యశ్రీని అటకెక్కించిందని, రైతన్నలకు పెట్టుబడి సాయం అందించకుండా అప్పుల పాలు చేసిందని మండిపడ్డారు. దాదాపు ఏడు లక్షల మంది రైతులకు అన్నదాత సుఖీభవ ఎగ్గొటారని ఆరోపించారు. ఈ నాలుగేళ్లలో మహిళలకు కేవలం రూ.8 వేలు కోట్లు మాత్రమే కూటమి ప్రభుత్వం కేటాయిస్తుండగా ..గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మహిళలకు వివిధ పథకాల ద్వారా సుమారు రూ.1.26 లక్షల కోట్లు అందించిందన్నారు. 2.60 లక్షల మంది వలంటీర్లను రోడ్డున పడేసిందని, ఇంటి వద్దకే రేషన్ బియ్యాన్ని పంపిణీ చేసే ఎండీయూ వ్యవస్థను రద్దు చేయడంతో 9,280 మంది ఆపరేటర్లు వీధి పాలయ్యారని తలారి వెంకట్రావు దుయ్యాబట్టారు. ఈ కార్యక్రమంలో రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి పరిమిసోమరాజు, ఎంపీపీ మట్టా వీరాస్వామి, చాగల్లు మండల పార్టీ అధ్యక్షుడు మట్టా వెంకట్రావు, పార్టీ జిల్లా ఆర్‌టీఐ విభాగం అధ్యక్షుడు ఇంటి వీర్రాజు, మాజీ ఎంపీటీసీలు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, బొర్రా కృష్ణ, ఎల్లె నాగేశ్వరరావు, ఎల్లె రాంబాబు, భట్టు రాజు తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం పడిగాపులు



దొండపూడి ఎరువుల డిపో వద్ద ధర్నా నిర్వహిస్తున్న రైతులు

గోపాలపురం: రైతులకు అవసరమైన యూరియాను అందించకుండా అధికారులు నానా ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ శనివారం దొండపూడి ఎరవుల డిపో వద్ద రైతులు ధర్నా రాస్తారోకో నిర్వహించారు. రోడ్డుపై బైఠాయించి అధికారులకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎకరానికి ఒక యూరియా బస్తా ఇస్తే ఎలా సరిపోతుందని, పట్టాదారు పాసుపుస్తకాలు, ఆధార్ కార్డులు అందజేసినా యూరియా ఇవ్వడం లేదని రైతులు వాపోయారు. యూరియా బస్తాతో పాటు కాంప్లెక్స్ ఎరువు కూడా తీసుకోవాలని షరతులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే వ్యవశాయశాఖ అధికారులు స్పందించి రైతులకు కావాల్సిన యూరియాను అందజేయాలని డిమాండ్ చేశారు.

మూగజీవాల మృత్యుఘోష

- పాడిగేదెల వరుస మరణాలు
- ఆర్థికంగా నష్టపోతున్న రైతులు



పెద్దేవంలో మృత్యువాత పడ్డ గేదె వివరాలను సేకరిస్తున్న అధికారుల బృందం

తాళ్లపూడి: మండలంలోని పేద్దవం గ్రామంలో ఇటీవల గేదెలు వరుస మృతితో పాడిరైతులను ఆందోళనకు గురిచేస్తుంది. ఈ మేరకు మూగజీవాల వరుస మృత్యువాత పడడంపై సమాచారం అందుకున్న పశు సంవర్ధక శాఖ అధికారుల బృందం శనివారం గ్రామంలో పర్యటించింది. అనంతరం డీడీ వై.కృష్ణ జ్యోతి, డాక్టర్ టి.మోహనాంభ సంబంధిత పాడిరైతులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని సుఘంది చెరువులోని నీటిని తాగే గేదెలు మాత్రమే మృత్యువాత పడుతున్నాయని, రైతులు చెప్పగా ఆ నీటిని పరీక్షలకు పంపారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాక డాక్టర్లు రాజేంద్ర ప్రసాద్, ఎస్ వసుంధర, ఎం.అనిత దేవి, ఏ.వెంకటరెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వానొచ్చే... నిండా ముంచేసే

లోతట్టు ప్రాంతాలు జలమయం

దేవరపల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో కొవ్వూరు డివిజన్‌లోని మెట్ట ప్రాంతాల్లో రెండు రోజులుగా వర్షాలు దంచికొడుతున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం వరకు కొద్దిపాటి ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. రానున్న మూడు రోజులు ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు వరి చేలకు ఉపయోగకరంగా ఉన్నప్పటికి, వాణిజ్య పంటలైన కూరగాయలు, పొగాకు నారుమడులకు నష్టం వాటిల్లుతుందని రైతులు వాపోతున్నారు. నారుమడుల్లో తేమ ఎక్కువగా ఉండి మొక్కలు చనిపోయే అవకాశం ఉందని దిగులు చెందుతున్నారు.

తాళ్లపూడి: మండల వ్యాప్తంగా శనివారం తెల్లవారు జాము నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాలు చెరువులను తలపించాయి. ప్రధాన రహదారుల్లో వరద నీటి తీవ్రత అధికమై జనజీవనం పూర్తిగా స్తంభించింది. భారీ వర్షంతో మండలంలో పలు గ్రామాల్లోని సీసీ రోడ్లపై, పల్లపు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. వర్షానికి గ్రామాల్లో రోడ్లు చిత్తడిగా మారాయి. తాళ్లపూడి మెయిన్ రోడ్డులోని అయ్యప్ప స్వామి ఆలయం సమీపంలో, తాళ్లపూడి నుంచి వేగేశ్వరపురం వెళ్లే రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. వేగేశ్వరపురంలోని వేంకటేశ్వరర స్వామి ఆలయం చుట్టూ వర్షపు నిలిచిపోయింది. మలకపల్లిలోని అంబేద్కర్ విగ్రహం ఎదురు వీధిలో వర్షపు నీరు ఇళ్లల్లోకి చేరింది. డ్రెయిన్‌లు పొంగిపోవడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. ప్రక్కిలంక రోడ్డులో, పైడిమెట్ట గజ్జరం రోడ్డులో, పలు గ్రామాల్లోని రోడ్డుపై నీరు నిలిచి అవస్థలు పడ్డారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న అల్లికాలువ

గోపాలపురం: మండలంలోని కొవ్వూరుపాడు సాగిపాడు గ్రామాల మధ్య అల్లికాలువ ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. శుక్రవారం అర్ధరాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షానికి శనివారం ఉదయం కాలువ ఉధృతంగా మారడంతో వాహనదారులు నానా అవస్థలు పడ్డారు. మండలంలోని పెద్దాపురం చిట్యాల గ్రామాల మధ్య వర్షపు నీరు రోడ్డు మీదకు రావడంతో భారీ వాహనాలు సైతం నిలిచిపోయాయి. కొవ్వాడ కాలువ నీటి ఉధృతికి లోతట్టు ప్రాంతాలైన చిట్యాల, వెంకటాయపాలెం గ్రామాలలోని వరి పంటలు నీటమునిగాయి. రాజంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రోడ్డు జలమయమైంది. దొండపూడి రాజంపాలెం గ్రామాల మధ్య వర్షపు నీటితో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.



దేవరపల్లిలో వర్షానికి రోడ్డుపై చేరిన నీరు

74.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

చాగల్లు: మండలంలో శనివారం తెల్లవారుజామున నాలుగు గంటల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. వరి చేలకు నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. ఈ మేరకు 74.2 మి.మీ వర్షపాతం నమోదు అయ్యిందని అధికారులు తెలిపారు. నిడదవోలు–పంగిడి ఆర్అండ్‌బీ రహదారిపై బ్రాహ్మణగూడెం శివారు, చాగల్లు శివారులో, ఊనగట్ల వద్ద వర్షపునీరు రోడ్డుపై అధికంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. దారవరం, బ్రాహ్మణగూడెం, నందిగంపాడు, మార్కొండపాడు, ఊనగట్ల, ఎస్.ముప్పవరం గ్రామాల్లో పల్లపు ప్రాంతాలు మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

నేల కూలిన తాటాకిల్లు

చాగల్లులో కురిసిన భారీ వర్షానికి తాటాకిల్లు నేలకూలింది. స్థానిక బెస్తా వీధిలో నివాసం ఉంటున్న గొల్ల నాగమణికి చెందిన తాటాకిల్లు ఒక్కసారిగా నేల వాలింది. ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యులందరూ పరుగులు తీయటంతో ఎటువంటి నష్టం జరగలేదు. మగ దిక్కు లేని తమ కుటుంబం రోడ్డున పడిందని నాగమణి కన్నీరుమున్నీరయ్యారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.



కొవ్వూరుపాడు–సాగిపాడు గ్రామాల మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న కాలువ



మలకపల్లి అంబేద్కర్ కాలనీలో నిలిచిన వర్షపు నీరు



చాగల్లులో తాటాకిల్లు కూలిపోవడంతో నిరాశ్రయులైన కుటుంబం

సన్నాయి వాయిద్యంలో యువకుడి ప్రతిభ



పవన్ వెంకట్‌ను సత్కరిస్తున్న దేవస్థానం ఈఓ మూర్తి

ద్వారకాతిరుమల: నల్లజర్ల మండలం దూబచర్లలోని డైట్ కళాశాలలో ఈనెల 11, 12 తేదీల్లో జరిగిన కళా ఉత్సవ్–2025 జిల్లా స్థాయి పోటీల్లో ద్వారకా తిరుమల శ్రీవారి దేవస్థానం హైస్కూల్ విద్యార్థి సన్నాయి వాయిద్యంలో సత్తా చాటాడు. పదోతరగతి చదువుతున్న బొండాడ పవన్ వెంకట్ సోలో మ్యూజిక్ సన్నాయి వాయిద్యంలో ప్రథమ బహుమతి సాధించాడు. శనివారం శ్రీవారి దేవస్థానం చైర్మన్ ఎస్వీ సుధాకరరావు, ఈఓ ఎన్‌వీఎస్ఎన్ మూర్తి యువకుడుకి స్వామివారి శేష వస్త్రాన్ని కప్పి, రాష్ట్ర స్థాయి పోటీల్లో సైతం ప్రతిభ కనబరచి, పాఠశాలకు మంచి పేరు తేవాలన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సీటీఆర్ఐ: స్వర్ణాంధ్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహిళలకు కుట్టు శిక్షణ, మగ్గం, బ్యూటీషియన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు నిర్వాహకులు లయన్ డాక్టర్ గుబ్బల రాంబాబు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కుట్టు, మగ్గం, బ్యూటీషన్ కోర్సుల్లో మహిళలకు మాత్రమే ప్రవేశం ఉంటుందని ప్రవేశం ఉంటుందన్నారు. సెప్టెంబర్ 22 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని, మెటీరియల్, మధ్యాహ్న భోజనం ఉచితంగా అందిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు లాలాచెరువు వద్ద స్వర్ణాంధ్ర సంస్థను స్వయంగా లేదా 9849847489 ఫోన్ ద్వారా సంప్రదించాలని కోరారు.